
కథానిక

# ఓ సుమనా, తిరిగి చూడు



డాక్టర్ జె. భాగ్యలక్ష్మి

సుమన స్టేజి మీద మెరుస్తోంది. తీగలా కదులుతోంది. ఆ వెడల్పయిన కనులలో భావ తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. ఆమె అడుగులు బద్ధంగా ముందుకు, వెనుక్కి కదులుతున్నాయి. తెరవెనుక పాట పాటకు జీవం పోస్తున్న ఆమె ఒంపు సొంపులు, సోయగాలు పొటయి పోయింది. నాట్య మాగిపోయింది. హాలంతా కరతాళ ధ్వనులు మారు మ్రోగాయి. ఆ నాటి ముఖ్య అతిథిగా మంత్రి గారు కార్యకర్తల విన్నపాన్ని ఆలకించి స్టేజి ఎక్కారు. ఆ నాటి నృత్యాంగనను పూల గుచ్ఛాలతో, శాలువతో సత్కరించారు. ఆమె నాట్యాన్ని, ఆమె కౌశల్యాన్ని మెచ్చుకొన్నారు. సుమన ఠీవిగా నిలుచుంది. ఇదంతా తనకు మామూలేనన్నట్టు. ఇతరుల పొగడ్తలు వినీ విననట్లు. చిరునవ్వు, నవ్వీ నవ్వనట్లు నవ్వుతోంది. తల నుతారంగా వాల్చి పువ్వులు వాసనచూస్తోంది.

నేను ప్రదర్శన కాగానే వెళ్ళిపోయాను. సుమనను కలుసుకొనే ప్రయత్నం చేయలేదు. కాస్త పొయెటిక్‌గా చెప్పాలంటే నా హృదయ వీణ మూగ పోయింది. హృదయాంతరాళంలో అస్పష్టంగా ఏదో బాధ మూలుగుతోంది. ఆ రాత్రంతా జాగారమే అయింది.

నిజానికి సుమన నా స్నేహితురాలు- మా కలయిక కూడా విచిత్రంగా జరిగింది. ఎం.ఎ., చదవాలని, ఆంగ్ల సాహిత్యమే చదవాలని నేననుకొన్నప్పుడు దరిదాపుల యూనివర్సిటీలలో ఎక్కడా సీటు దొరక లేదు. అప్పుడు ప్రైవేటుగా చదవాలనుకొనే వారికి బెనారస్ ఒక ఆకర్షణ. అలా చదువు తున్నప్పుడు పరీక్షల సమయంలో ప్రైవేట్ కేండిడేట్సు కలిసే అవకాశముంటుంది. అందరికీ వసతి హాస్టల్‌లో ఏర్పాటు చేస్తారు. అంత పెద్ద ప్రాంగణంలో ఎక్కడో ఒక చోట చదువుకొంటూ ఒకరి కొకరు తారసపడుతుంటారు.

అక్కడ ఒక పెద్ద తోట ఉంది. ఒక విధంగా చూస్తే చిన్న సైజు అడవి. చక్కటి చెట్టు ఒకటి చూసుకొని దాని నీడలో వర్డ్స్ వర్త్ వ్రాసిన 'ప్రెల్యూడ్' చదువుతున్నాను. ఆ కవితా ఝురులలో తలమునకలవుతూ ఒకసారి ఎందుకో తలెత్తి చూశాను. అలా చూస్తూ ఉండిపోయాను. అది ఏమి దృశ్యం! ఎటువంటి లాస్యం! అటువంటి అద్భుతాన్ని నేను అదివరకు ఎన్నడూ చూడలేదు. అస్తమించే సూర్యుని బంగారు కిరణాలలో. నెమలి పింఛము వెదజల్లే వెలుగు జిలుగులు, పురి విప్పి నాట్య మాడుతున్న మయూరి ఏ కవిత్వం దీనికి దీటు రాగలదు? ఏ చిత్రం దీనిని పొందుపరచగలదు? ఏ గానం, ఏ నృత్యం దీనికి అద్దం పట్టగలదు?

ఎంతసేపు అలా చూస్తూ ఉన్నానో తెలీదు. తనలోని ఆనంద తరంగాల ఉరవడి తగ్గిందేమో, ఇంత బారు పురిని ముడిచి ఠీవిగా ఊగుతూ, తూగుతూ చెట్ల మధ్యకు వెళ్ళిపోయింది నెమలి. నా ప్రక్కనే గాజుల సవ్వడి, అప్పుడు చూశానామెను. మనోహరంగా నవ్వింది. "అద్భుతంగా, మంత్రముగ్ధంగా ఉంది" అంది ఇంగ్లీష్‌లో.

"మీరు కూడ ఎం.ఎ కు చదువుతున్నారా?" అని అడిగాను.

అవునని తల ఊపింది.

"ఏ సబ్జెక్టు?"

"హిస్టరీ"

పరిచయాలయ్యాయి. తను తెలుగమ్మాయి అని తెలిసింది. పేరు సుమన.

పరీక్షలపుడు ఎంత చదివినా ఇంకా తగినంత చదవలేదని పిస్తుంది. అందుకే ప్రతి క్షణమూ ముఖ్యమే. పరీక్షలయ్యే వరకు మా కలయికలు క్లుప్తంగా ఉండేవి. మెస్సులో తారస పడినపుడు మాత్రం కొద్దిగా మాట్లాడుకొనే వాళ్ళం. మాకు రాని హిందీతో తంటాలు పడుతూ తెగ నవ్వుకొనే వాళ్ళం.

సుమన తను డాన్సరని చెప్పినపుడు చాలా ఆశ్చర్య పోయాను. తనంటే ఒక విధమైన ఆరాధనా భావం మెదిలింది. నాకు నాట్య మన్నా, నాట్యం చేసేవాళ్ళన్నా చాలా ఇష్టం. తను కూచిపూడి నేర్చుకొందట. ప్రదర్శనలు కూడా ఇస్తూ ఉంటుందట. అప్పటి నుంచి తను నడుస్తున్నా కూర్చున్నా, ఎవరితోనైనా మాట్లాడుతున్నా చదువుకొంటున్నా తనో సజీవ శిల్పమైనట్లు తన ను నేను గమనిస్తూ ఉండేదాన్ని. ఒకటి రెండు సార్లు నన్ను చూసి సిగ్గు పడ్డట్లు నవ్వింది.

ఆ తర్వాత నాలుగయిదేండ్లకు మేమిద్దరం హైదరాబాద్‌లో కలిశాము. తను డాన్సర్‌గా అప్పటికే పేరు తెచ్చుకొంది. హైదరాబాద్‌లోనే ఉంటోంది. లెక్చరరుగా నా ఉద్యోగమూ అక్కడే కావటంతో మేము తరుచూ కలుసుకొనే వీలుండేది.

మొదటిసారిగా తన ప్రదర్శన చూసిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది. ఆ పెద్ద హాలులో చిరు చీకట్లో కూర్చున్న నాకు స్టేజి మీద లైట్ల కాంతుల్లో మిరు మిట్లు గొలుపుతూ సౌందర్య రాశిలా, ఒప్పుల కుప్పలా, లతాంగిలా, హేమలతలా, తటిల్లతలా ఉన్న సుమన కేవలం నాకోసమే నృత్యం చేసినట్లు అనుకొన్నాను. నా ఒళ్ళు జలదరించింది. కళ్ళలో నీళ్ళుబికి వచ్చాయి. ఆనంద తరంగాలు నన్ను చుట్టు ముట్టాయి. వాటి తాకిడి నాకు తెలుస్తోంది.

ఇంతకీ స్టేజి మీద నేను చూస్తున్నది సుమనని కాదు. అక్కడ దాక్షాయణే, గిరిజ, పార్వతి, దుర్గ... ఆ కళ్ళు చూపే భావాలు, పద ధ్వనులు నాదాలు, అభినయంలోని అర్థాలు... ప్రేక్షకులు తన్మయులై చూస్తున్నారు....

సుమన తన ప్రదర్శనల కోసం చాలా ఊళ్లకు వెళ్ళి వస్తుండేది. విదేశాలు కూడ పర్యటించింది. తనని ఎప్పుడో గాని కలుసుకోటం జరిగేది కాదు. తన ప్రదర్శన ఊళ్ళో ఉంటే మాత్రం తప్పక వెళ్ళేదాన్ని, ఒకోసారి స్టేజి వెనకకు వెళ్ళి పరికరించేదాన్ని. ఒక్కోసారి కుదిరేది కాదు, కాని ఒక విషయం మాత్రం చెప్పుకోవాలి. తన ప్రదర్శనలు ఎన్నిసార్లు చూసినా, చూసిన ఐటమ్స్ చూసినా సంతోషం ఇనుమడించేది గాని, ఏ మాత్రం విసుగొచ్చేది కాదు.

సుమన ఒక డాన్సు స్కూల్ కూడా పెట్టింది. దానితో ఇంకా బిజీ ఐ పోయింది. మేము ఫోన్లో మాట్లాడుకొనేది కూడ కుదిరేది కాదు. కాని తన గురించి పేపర్లలో, పత్రికలలో చదువుతున్నాను. తన ప్రదర్శనల గురించి రెవ్యూలు చూస్తున్నాను. తన టీవీ ప్రోగ్రామ్‌లు చూశాను. ఇంటర్‌వ్యూలు చూశాను. మొదట మన వాళ్ళు అంతరిక్ష ఉపగ్రహాన్ని ప్రయోగించి టెలికాస్ట్ చేసినప్పుడు మొదటి కార్యక్రమం తనదే! నా హృదయం గర్వంతో పొంగిపోయింది.

సుమనకూ, నాకూ దూరమెక్కువయింది. కాని నా మనసు తనలోని ఆర్టిస్టును ఆరాధిస్తోంది. అంత గొప్ప ఆర్టిస్టు ఒకప్పుడు నా ఫ్రెండ్ అన్న ఆలోచన కూడా చాలా తృప్తి నిస్తోంది.

కాని... ఈ నాడేమయింది? నేను ఆరాధించిన కళాకారిణి ఉన్నత శిఖరాల నుంచి దిగి మామూలు నర్తకి సుమన అయింది. తనకు నైపుణ్యం వుంది కా బట్టి ప్రయోగాలు చేస్తోంది. అన్ని రీతులూ చాలా నేర్పుతో కలిపింది. అయితే ఫలితం... నేను ప్రదర్శనలో లీనం కాలేదు. ఆనంద తరంగాలు నన్ను చుట్టు ముట్ట లేదు. నా కళ్ళలో నీళ్ళు ఉబికి రాలేదు. సర్కసులో ఫీట్లు చూసినట్లు చూశాను ఆమె నృత్యం భంగిమలను.

ఎక్కడుంది లోపం... రాత్రి గడిచింది. తెల్లవారింది. పనులన్నీ యాంత్రికంగా జరిగి పోతున్నాయి గాని ఆలోచన తెరిపి ఇవ్వడం లేదు. ఇంతలో ప్రక్కింటి ఉమ వచ్చింది. "అక్కా నీకో సర్ప్రయిజ్ నేనో కొత్త వంట చేశాను. నీవు రుచి చూసి చెప్పాలి."

"నీవు చేసే వంటలెప్పుడూ బాగుంటాయి ఉమా ఈ రోజు స్పెషలేమిటి?"

"స్పెషలే అక్కా ఈ రోజ నా బర్త్‌డే. అందుకే కొత్త రకం స్వీటు చేశాను. ఇటువంటిది మీ రెక్కడా రుచి చూసి ఉండరు.."

తను బలవంతంగా ఆ గిన్నె నా ఎదురుగా పెట్టింది. మూత తీసి చూశాను.

నిజంగానే గులాబి రంగులో కొత్తగా కనిపించింది. దాని మీద దట్టంగా ఉన్న బాదం పప్పులు, జీడి పప్పులు, ద్రాక్ష... స్పూనుతో తీసి నోట్లో పెట్టుకున్నాను.

"ఎలా ఉందక్కా" అంది ఉమా ఆత్రుతగా.

"బాగుంది" అన్నాను అది దిగమింగుతూ.

"అంతేనా?"

"ఇంకేం చెప్పమంటావు, చాలా బాగుంది." అన్నాను తనను ఉత్సాహ పరుస్తూ, అసలు నేను తిన్నది పాయసమో కస్టర్డో తెలియలేదు. పాత కొత్తల కలయికగా మా సుమన డాన్సులా ఉంది.


## కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్నీ, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తి కరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి!

కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్..
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034